## 27 వ వార్డ్ ప్రచారంలో పాల్గొన్న విజయ్ రెడ్డి





**దశ రాజన్న సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 27వ వార్డు అభ్యర్థి తరపున ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రేవంత్ మిత్రమండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి. ఈ సందర్భంగా ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పేద ప్రజలకు ప్రవేశపెట్టినటువంటి సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆయన వెంట నాయకులు సాయి ప్రేమ్, శేఖర్, హుస్సేన్, పర్శరాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల మెరుపు ధర్నా

❖ జాబ్ క్యాలెండర్ కోసం పట్టుబట్టిన యువత



**దశ, హైదరాబాద్ :** రాష్ట్రంలో నిరుద్యోగుల సెగ మరోసారి రోడ్డెక్కింది. ప్రభుత్వం వెంటనే 'జాబ్ క్యాలెండర్' విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద మెరుపు ధర్నాకు దిగారు. ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంలేదనే మనస్థాపంతో ఇటీవల హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడాషపల్లి గ్రామానికి చెందిన బండారి కుమారస్వామి ఆత్మహత్యకు పాల్పడు. ఈ ఘటనతో నిరుద్యోగ లోకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఆత్మహత్య జరిగిందని మండిపడుతూ శనివారం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో వందలాది మంది నిరుద్యోగులు రోడ్డుపైకి వచ్చి మెరుపు ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం కుమారస్వామి మృతికి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. యూపీఎస్సీ తరహాలో ఏటా నోటిఫికేషన్లు, పరీక్షల తేదీలతో కూడిన పక్కా జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రూప్ 1, 2, 3 నోటిఫికేషన్లతో పాటు, మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి పోస్టుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో ఏఈ, జేఎల్ఎం వంటి పోస్టుల భర్తీకి తక్షణమే చర్యలు తీసుకోలన్నారు.

# గజ్వేల్‌లో కాంగ్రెస్ ప్రచారానికి మంత్రి అజారుద్దీన్

❖ గజ్వేల్ అభివృద్ధి కాలేదు, కేసీఆర్ ఫామ్ హౌస్ అభివృద్ధి




**దశ, గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి అజారుద్దీన్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ కూన శ్రీశైలం గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ గజ్వేల్‌లో అభివృద్ధి జరగలేదు. ఇక్కడ అభివృద్ధి జరిగింది కేసీఆర్ ఫామ్ హౌస్‌కి మాత్రమే అంటూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గజ్వేల్ ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి మార్పు కోరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పాలనలోనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రస్తావన చేస్తూ,అక్కడ బీఆర్ఎస్ కోసం పెద్ద ఎత్తున నాయకులు వచ్చారు అజారుద్దీన్‌కు రాజకీయాలు తెలియవని విమర్శలు చేశారు. అయినా ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారు అని గుర్తు చేశారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల మాదిరిగానే గజ్వేల్‌లో కూడా బీఆర్ఎస్‌కు ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని మంత్రి అజారుద్దీన్ పిలుపునిచ్చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ వస్తే గజ్వేల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, రెండు మూడు వాడు అభ్యర్థులు జంగం రమేష్, మహమ్మద్ సమీర్ పాల్గొన్నారు.



# కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది: సర్పంచ్ మల్లేష్



**దశ, తుంగతుర్తి:** తుంగతుర్తి మండలం సంగేం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గున్న సత్తెమ్మ, నాయకుడు ఇరుగు దానయ్య ఇటీవల ఆరోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కలకోట్ల మల్లేష్ శనివారం వారి కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబాలకు 100 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకులారా బిక్షం రెడ్డి, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కలకోట్ల దాసులు, మాజీ ఉపసర్పంచ్ అనిత లింగయ్య ,ఏషమల్ల బాలరాజు, జటంగి మల్లయ్య, వీరబోయిన ఉప్పలయ్య, జటంగి నాగయ్య, జటంగి వెంకన్న, వీరబోయిన మల్లయ్య ,కన్నెగంటి వెంకటరమణాచారి, చెడుపాక వెంకన్న, చెడుపాక రవి, కలకోట్ల ఎలైజర్, ముత్యాలు రమేష్, రవి, ఇరుగు ఉప్పలయ్య ,మధుసూదన్ ,హిమానీలు ,నాగయ్య, మల్లేష్, నితిన్ ,నాగరాజు, రాకేష్ రెడ్డి, బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపోల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయం

❖ బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ఫోకస్
❖ పేదలకు సన్నబియ్యం, సంక్షేమ పథకాలతో ప్రజాదరణ
❖ తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి చేస్తాం
❖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**దశ, సిద్దిపేట:** రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మీడియా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ (ఏ,బీ,సీ,డీ) విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు" అని తుమ్మల గుర్తు చేశారు.

# సంగారెడ్డి గెలిపిస్తే రూ.300 కోట్లు తెస్తా

❖ ఉచిత బస్సు పథకంపై రాద్ధాంతం వద్దు
❖ 60 సీట్ల బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా?
❖ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి బరిలో 'నిర్మల జగ్గారెడ్డి'
❖ కాంగ్రెస్ బలోపేతం కోసం రాష్ట్రం మొత్తం తిరుగుతా
❖ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**దశ, సంగారెడ్డి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు.
బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.



# ఇబ్రహీంపట్నంలో "జీకే లైవ్ ఫిష్ స్టాల్" ప్రారంభం

❖ ప్రారంభించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**దశ, ఇబ్రహీం పట్నం :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని మంచాల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "జీకే లైవ్ ఫిష్ స్టాల్"*ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) శుభారంభం చేశారు. ఈ లైవ్ ఫిష్ స్టాల్‌ను మాజీ కౌన్సిలర్, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్రీ గుంటి కిరణ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని తెలిపారు. చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందితేనే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాపార ప్రయత్నాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. స్టాల్ నిర్వాహకులు గుంటి కిరణ్ గారికి శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు ఇటువంటి వ్యాపారాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.